క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న వలంటీర్లు, నాయకులు

పెందుర్తి: దివంగత వైఎస్సార్‌సీపీ నేత నక్కా కనకరాజు జ్ఞాపకార్థం పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో అక్కిరెడ్డిపాలెం, ముదపాక గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లు మంగళవారం అన్నదానం చేశారు. మొత్తం 150 మందికి మధ్యాహ్న భోజనం అందజేశారు. కార్యక్రమంలో నక్కా కనకరాజు కుమారుడు నక్కా బాలమురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు సూర్యప్రకాష్, నక్కా మహేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరునక్షత్రం పూజలు



పూజలు నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మనవాళ మహా మునులు తిరు నక్షత్రం పూజలు మూడోరోజు బుధవారం కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం దివ్యప్రబంధ పారాయణం పఠించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు, అధ్యాపకులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

18న జాబ్ మేళా

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ అధ్వర్యంలో హెటిరో డ్రగ్స్ సౌజన్యంతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ అర్హత కలిగి 2020 నుంచి 2023 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆరోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జాబ్ మేళాకు బయోడేటాతో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8143277610 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు

సింహాచలం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 9 నుంచి 13 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్-14 విభాగంలో కె.మురళి, పి.జశ్వంత్, అండర్-17 విభాగంలో వి.మధు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. ఉత్తమ విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు కె.దుర్గాప్రసాద్, డి.అప్పారావును అభినందించారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చిన్నముషిడివాడకు చెందిన కర్రి సింహాచలంనాయుడు అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి మర్రిపాలెం మీదుగా నగరంలోని లోటస్ ఆస్పత్రికి వెళ్తుండగా.. 2.45 గంటలకు ఐటీఐ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదే దారిలో వేగంగా వస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో అతడికి గాయాలయ్యాయి. ప్రస్తుతం మర్రిపాలెం వద్ద ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



కలెక్టర్ రవిపట్టాన్ శెట్టికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి



కాలువ సమస్యపై వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ కల్పనరాజశేఖర్

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు
- అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి
- 'జగనన్నకు చెబుదాం'కు 67 వినతులు

పరవాడ: వివిధ సమస్యలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో సింహాద్రి ఎన్టీపీసీ కల్యాణ మండపంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ మండలాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. ఆక్రమణలను అడ్డుకోవడానికి కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్పందనలో ప్రజల నుంచి అందిన వినతులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు.

67 వినతులు

స్పందన కార్యక్రమం నిర్వహణ కోసం వివిధ శాఖలకు సంబంధించి 18 కౌంటర్లు ఏర్పాటు చేశారు. మండలం నలు మూలల నుంచి వివిధ సమస్యలపై 67 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 51 వినతులు వచ్చాయి. మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట పార్టీ నేతలు ఉన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ, ట్రైనీ కలెక్టర్ స్మ్రాన్‌రాజ్, డీపీవో ఆర్.శిరీషారాణి, డ్వామాపీడీ ఈ.సందీప్, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి ఎస్.మంజులవాణి, అడిషినల్ పీడీ డీఆర్‌డీఏ డైజీ, పరవాడ తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి వసతి కల్పించాలి

తానాం గ్రామంలో నీటి కాలుష్యం వల్ల వృత్తి సాగించడానికి రజకులు ఇబ్బందులు పడుతున్నారని అనకాపల్లి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు అన్నారు. దుస్తులు శుభ్రపరచడానికి మంచినీటి వసతి కల్పించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. తానాం గ్రామం చుట్టూ ఉన్న ఫార్మా పరిశ్రమల కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై కుల వృత్తి అయిన బట్టలు ఉతకడం సాధ్యం కావడం లేదని వివరించారు. .

శ్మశాన వాటికకు రక్షణ కల్పించండి

రావాడ శివారు గొల్లగుంట శ్మశాన వాటిక స్థలానికి రక్షణ కల్పించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. నడింపల్లి రెవెన్యూలో సర్వే నంబరు 2లో 0.80 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించాలని చూస్తున్నారు. పూర్వీకుల నుంచి ఈ శ్మశాన వాటికను వినియోగిస్తున్నాం. ఆ స్థలానికి రక్షణ కల్పించాలి.

డ్రైనేజీ లేక ఇబ్బందులు



పి.బోనంగిలో ఏడాది కిందట పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ కాలువ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.దీంతో గ్రామంలో మురుగునీరు పోవడానికి వీల్లేక ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. ఫలితంగా అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. సీసీ కాలువ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న స్థల సమస్యను పరిష్కారించాలి.

– బండారు కల్పనరాజశేఖర్, సర్పంచ్, పి.బోనంగి

కాలుష్యాన్ని అరికట్టాలి



హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమల ద్వారా విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలి. బొగ్గు, బూడిద లారీలు నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగించడంతో విడుదలవుతున్న ధూళి వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల రహదారులు ధ్వంసమవుతున్నాయి. వాటిని పునర్నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి.

–బొడ్డపు చిన్నారావు, బొడ్డపువానిపాలెం

ఇల్లు మంజూరు చేయండి



పెదముషిడివాడ శివారు గండివానిపాలెం గ్రామంలో ఇల్లు నిర్మాణానికి స్థలం లేక 18 ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నాం. ఇద్దరు పిల్లలు, భర్తతో కలిసి అద్దె ఇంట్లో కాలక్షేపం చేస్తున్నాం. సమస్యను పరిశీలించి ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మంజూరు చేయాలి.

– కరణం లక్ష్మి, గండివానిపాలెం

భూమి ఆన్ లైన్ చేయాలి



రావాడ రెవెన్యూ పరిధిలో నాకున్న 0.23 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో అవసరం నిమిత్తం అమ్ముకోవడానికి వీలుకాలేదు. నా భూమి పక్క లేఅవుట్‌లో నమోదై ఉంది. పాస్‌పుస్తకాలు నా పేరున ఉన్నాయి. నా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆదుకోవాలి.

– దుంగల అప్పలనాయుడు, నాయుడుపాలెం

జగన్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు

పరవాడ: మండలంలోని పి.బోనంగి, కలపాక గ్రామ సచివాలయాల పరిధిలో పార్టీ నేతలు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు బండారు కల్పన రాజశేఖర్, బొండా కనకారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నాలుగున్నరేళ్లలో మంజూరైన సంక్షేమ పథకాల వివరాలను డిజిటల్ బోర్డుల ద్వారా వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సంక్షేమం అందుతుందని.. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయనకు మద్దతు తెలపాలని కోరారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, పార్టీ నాయకులు జానకీరాం, బొండా గోవింద, అప్పారావు, పెంటారావు, బండారు బోయన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



కళా రూపాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

పరవాడ: ఆధునిక ప్రపంచడంలో రాణించడానికి ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాలను బుధవారం ఇంగ్లిష్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన, పుస్తకాల ఆవశ్యకత, వాటి ప్రాధాన్యత, స్వీయ అనుభవాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చిన్నారులు వివిధ కళా రూపాలను ప్రదర్శించారు. పాఠశాల సీఈవో కె.నిశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీలో24న ఆశ్ర జాతీయ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆశ్ర ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మక వినియోగదారుల సంస్థ ఆశ్ర (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) 5వ జాతీయ సదస్సు ఈ నెల 24న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్నట్టు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు పాలమరశెట్టి రత్నరాజు తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా పాలమరశెట్టి మాట్లాడుతూ సెలబ్రిటీ గెస్ట్‌గా టాలీవుడ్ యాక్టర్ అలీ, భారతదేశ వినియోగదారుల సంఘం కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్, అమెరికా ఆపరేషన్ హెడ్ హరికృష్ణ, సౌత్ కొరియా ఖనరీసస్ వ్యవస్థాపకుడు హంగ్‌సున్‌యంగ్, బాబూభాయ్, ఆర్‌ఆర్ టీమ్, ఖంటేయం తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. ఆశ్రా మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన సంస్థగా దేశంలో సుమారు వెయ్యికి పైగా ప్రతినిధులతోనూ, చీఫ్ ప్యాట్రన్ సుప్రీం కోర్టు లాయర్ హబీస్ సుల్తాన్ అలీ నేతృత్వంలో దేశంలోని పది రాష్ట్రాల్లో నడుస్తుందన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించి వారికి ప్రతిభా అవార్డులు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్బాల్ తెలిపారు. కార్యక్రమంలో ఈవెంట్ హెడ్ వీరూమామ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం




మిథిలాపురి వుడా కాలనీలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మధురవాడ: కూరాకుల కులాన్ని రాష్ట్రంలో అన్ని చోట్లా బీసీ – ఏ జాబితాలో చేర్చినందుకు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో ఆ కులానికి చెందిన పలువురు బుధవారం సంబరాలు చేసుకున్నారు. ప్రాంతీయ పరిధులు లేకుండా అందరికీ రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి విశాఖ జిల్లా కూరాకుల సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ కోట ఆనంద్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘాల అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమణమూర్తి, కూరాకుల సంఘం కార్యవర్గ సభ్యులు చోడవరపు వెంకటస్వామి, కోట సంజీవరావు, పి.రామారావు, చోడవరపు కరుణాసాగర్, అల్లాడ శ్రీనివాస్, కోట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికే ప్రజల మద్దతు

ఎంపీపీ సూర్యకుమారి



బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: చెంతకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..,పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. గ్రామంలో సంక్షేమ కార్యక్రమాల ద్వారా సుమారు రూ.11.82 కోట్లు లబ్ధిదారులకు అందాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు,పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు, సబ్బవరపు ముత్యాల నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ కొటాన కోటయ్య, ప్రోగాం నోడల్ ఆఫీసర్ మహేష్, ఐడీ బాబు,బోను గంగునాయుడు పాల్గొన్నారు.

ఒడిశా వాసి ఆత్మహత్య

పెదగంట్యాడ: ఒడిశాకు చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అభినాష్ సాహు (22) భానోజీతోట రోడ్డు నంబర్–6లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కోరమాండల్‌లోని ఓ కాంట్రాక్టర్ వద్ద ఎల్రక్టికల్ పనులు చేసుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం విధులకు వెళ్లి వచ్చిన అభినాష్ రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లోని ఓ బెడ్‌రూమ్‌లో నిద్రపోయాడు. వేకువజామున 5 గంటల సమయంలో అతని తల్లి నిద్రలేచి చూడగా అతడి గది లోపల గడియపెట్టి ఉంది. తలుపు తట్టినా తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. చుట్టుపక్కల వారు వచ్చి తలుపు విరగ్గొట్టి అతడిని కిందకు దింపారు. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఒత్తిడికి లోనై తన సోదరుడు ఆత్మహత్య చేసుకున్నాడని' మృతుడి సోదరుడు దుష్మంత్ సాహు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలకు బ్రేక్

మహారాణిపేట: చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలను అరికట్టగలమని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నా రు. జేసీ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో బాల్యవివాహాల నివారణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా వీటికి పాల్పడినా.. సహకరించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వివాహ సమయంలో అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లుగా పేర్కొంటూ వయసు నిర్ధారణ పత్రాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఫంక్షన్ హాళ్లు, దేవాలయాలు, చర్చి లు, మసీదులు, ఇతర వేదికల వద్ద వివాహ వయసును ధ్రువీకరించే పత్రాలను సమర్పిస్తేనే అక్కడ పెళ్లి చేసేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. బాల్యవివాహాలు చేస్తున్నట్లు సమాచారం అందితే.. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెళ్లి వేదికల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి బాల్యవివాహాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివాహం చేసుకున్న దంపతులు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జేసీ సూచించారు. సమావేశంలో డీఎల్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ, డీఆర్వో కె.మోహన్ కుమార్, డీఎల్డీవో పూర్ణిమాదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, దిశ డీఎస్పీ సీహెచ్.వివేకానంద, డీఈవో చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్ల పరిశీలన



బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: సామాజిక సాధికార యాత్రలో భాగంగా సబ్బవరంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. శ్రీదుర్గాలమ్మ ఆలయ సమీపంలో సబ్బవరం–చోడవరం రోడ్డులో బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉంటుందని గుర్తించారు. బహిరంగ సభకు భారీగా పార్టీ అభిమానులు,ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో పార్కింగ్‌తో పాటు సభకు అవసరమైన ఏర్పాట్లపై పార్టీ నేతలతో చర్చించారు. స్థల పరిశీలన చేసిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,మండల లక్ష్మణ,సబ్బవరపు నాగభూషణం ,సీఐ రంగనాథం, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మపీఠం, సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సింహాచలంలోని దేవస్థానం పుష్కరిణి సత్రం ప్రాంగణంలో శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి గణపతిపూజ, కలశస్థాపన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, పుష్పారాధన, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈనెల 20వతేదీ వరకు జయంతి మహోత్సవాలు జరుగుతాయని కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మపీఠం సేవా ట్రస్ట్ ప్రతినిధి సాంబమూర్తి తెలిపారు. దీనిలో భాగంగా ప్రతీరోజూ ఉదయం నిత్యపూజ ఉంటుందన్నారు. 17న సాయంత్రం 4.30గంటల నుంచి అమ్మవారి కుంకుమపూజ, 18న సాయంత్రం 4.30గంటల నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం, 19న సాయంత్రం 6గంటల నుంచి స్వామివారి సమాధి ఘట్టం, అఖండ దీపారాధన, 20న మధ్యాహ్నం 12గంటల నుంచి అన్న సమారాధన, సాయంత్రం 4గంటల నుంచి స్వామివారి ఊరేగింపు జరుగుతాయని తెలిపారు. భక్తులంతా ఈకార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

రాధాకృష్ణ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

పెందుర్తి: నగరంలోని ఆర్కె బీచ్ వద్ద ఈ నెల 26న జరగనున్న రాధాకృష్ణ మహోత్సవ పోస్టర్‌ను జిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. వేపగుంటలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ సముద్రతీరాన రాధాకృష్ణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉరుకూటి మహలక్ష్మినాయుడు, పెందుర్తి నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు ఉప్పిలి కనకరాజు, చందక చలపతిరావు, కాయిత ఎర్నిబాబు, మొల్లి అప్పారావు, పిల్లల అప్పలనాయుడు, పల్ల దుర్గారావు, మువ్వల సురేష్, పీతల విష్ణు, మామిడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమనేతలకు ఘన నివాళి



గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న రాజేంద్రప్రసాద్ తదితరులు

సింహాచలం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం అడవివరం గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమనేతల సంస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమ కారులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు చిత్రపటాలకు గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమానికే స్ఫూర్తిదాయకంగా గ్రంథాలయ ఉద్యమం నడిపించిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య అని కొనియాడారు.

మంచి పుస్తకం వందమంది మిత్రులతో సమానమని, వేల పుస్తకాలు కలిగిన ఆలయమే గ్రంథాలయమని తెలిపారు. ప్రతీ ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు– సామాజిక బాధ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత కార్యదర్శి పెంకి కృష్ణారావు, కార్మిక నాయకుడు సీహెచ్. సూర్యనారాయణరాజు, న్యాయవాది కె.రామకృష్ణ, పాఠకులు బాలభానుమూర్తి, వర్మ, బాలాజీ, కిర ణ్, రవి, సూర్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరం



కోలాటం పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్

సబ్బవరం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. ఆరిపాక గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్ రాజ్ కోలాటం పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. ఆధ్యాత్మిక విలువలు పెంపొందించే విధంగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు.

మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవిందు, కొటాన రాము, ఆలయ ధర్మకర్త, మాజీ ఎంపీటీసీ మళ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు